http://vaasthavanestham.com

# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

News Portal Designing
Epaper Designing &
Web Hosting

Vn Media

+91 8099779988
vntelugudaily@gmail.com

సంపుటి: 1 । సంచిక: 1 । ఎడిటర్: సయ్యద్ ఖమర్ । గురువారం, 20 ఆగస్టు 2026 । పేజీలు: 8 పేజీలు: 8 । వెల: 2 రూ.

# హైదరాబాద్‌లో భారీ కల్తీ నెయ్యి

## ఒకేసారి 130 కేంద్రాల్లో టాస్క్ ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులు

## పాలు లేకుండానే పామ్ ఆయిల్, రసాయనాలతో తయారు చేస్తున్న ముఠా

## హోటళ్లు, స్వీట్ షాపులు, పూజా సామగ్రి పేరిట మార్కెట్లోకి విక్రయాలు



వాస్తవ నేస్తం,హైదరాబాద్ : రాజధాని నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న భారీ కల్తీ నెయ్యి ముఠా ఆటను హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ , ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు సంయుక్తంగా కట్టడి చేశారు. మంగళవారం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 130 ప్రాంగణాల్లో ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, సుమారు 36 టన్నుల కల్తీ నెయ్యి, ప్రమాదకర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న సరుకులో 25.5 టన్నుల కల్తీ నెయ్యి, 8.7 టన్నుల క్రీమ్, 1,200 లీటర్ల పామ్ ఆయిల్, 600 లీటర్ల వనస్పతి (డాల్డా), 30 కేజీల స్టార్చ్‌తో పాటు కృత్రిమ సువాసన ద్రవాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కల్తీ ముఠా అత్యంత ప్రమాదకర రీతిలో నకిలీ నెయ్యిని తయారు చేస్తున్నట్లు దాడుల్లో బట్టబయలైంది. స్కిమ్డ్ మిల్క్ పౌడర్, పామ్ ఆయిల్, డాల్డా, స్టార్చ్, హానికర రసాయనాలను మిశ్రమం చేసి అసలు పాలే వాడకుండా నెయ్యిని సృష్టిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి నాసిరకం ముడి సరుకును తెప్పించి తక్కువ ఖర్చుతో తయారు చేస్తున్నారు. ల్యాబ్ పరీక్షల్లోనూ చిక్కకుండా ఉండేందుకు బీటా-కెరోటిన్, ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్ లాంటి రసాయనాలు కలుపుతున్నారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి, ఎలాంటి అనుమతులు, బ్యాచ్ నంబర్లు లేకుండా 100% ప్యూర్ నెయ్యి , ఫార్మ్ ఫ్రెష్ నెయ్యి" వంటి ఆకర్షణీయమైన పేర్లతో హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ దుకాణాలు, ఆయుర్వేద షాపులు, పూజా సామగ్రి దుకాణాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నారు.

**తీవ్ర అనారోగ్య ముప్పు -- పోలీసుల హెచ్చరిక..**

ఈ కల్తీ నెయ్యి వాడకం వల్ల శరీరంలో బాడ్ కొలెస్ట్రాల్ పెరిగి గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదముందని, లివర్, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతింటాయని అధికారులు హెచ్చరించారు. కల్తీ ఆహార విక్రేతలపై కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ సీపీ హెచ్చరించారు. మార్కెట్లో గుర్తింపు ఉన్న నాణ్యమైన సీల్డ్ ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేయాలని, తక్కువ ధరకు వచ్చే విడి నెయ్యిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా కల్తీ జరుగుతున్నట్లు అనుమానం వస్తే డయల్ 112 హెల్ప్‌లైన్ నంబర్ 8712661212 కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# పజల్లో నమ్మకం పెంచేలా

## విధులు నిర్వర్తించాలి



వాస్తవ నేస్తం,ఆదిలాబాద్: ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం, గౌరవం పెంచేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశించారు. బుధవారం ఆయన సిరికొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, వాహనాల స్థితిగతులను పరిశీలించిన అనంతరం స్టేషన్ రికార్డులు, సిబ్బంది డ్యూటీ రోస్టర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మండల పరిధిలో గంజాయి, గుడుంబా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడాలని, పూర్తి క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని, ప్రతి గ్రామానికి నియమించిన విలేజ్ పోలీస్ ఆఫీసర్ సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు వేగంగా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. చిన్న చిన్న నేరాలను ప్రారంభంలోనే అరికట్టాలని, కోర్టు డ్యూటీ అధికారులు వారెంట్లు, సమన్లు సకాలంలో జారీ చేస్తూ నిందితులకు శిక్షలు పడేలా చూడాలని పేర్కొన్నారు. అలాగే రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు ఓపెన్ డ్రింకింగ్, ఫేక్ నంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, ఎస్ఐ విక్రమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



## ఘనంగా 376వ జయంతి వేడుకలు

## పాపన్న విగ్రహానికి అదనపు కలెక్టర్ రాజేశ్వర్ నివాళి

వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ : బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక, మొఘల్ సామ్రాజ్య దౌర్జన్యాలపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ కొనియాడారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి పాపన్న విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన పాపన్న, పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా గెరిల్లా సైన్యాన్ని నిర్మించి ఏకంగా 21 కోటలను స్వాధీనం చేసుకోవడం ఆయన అసాధారణ సాహసానికి నిదర్శనమన్నారు. దక్షిణ భారతదేశంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి ఎందరో యోధులకు బ్రిటిష్ పాలకులపై పోరాడేందుకు పాపన్న చరిత్ర గొప్ప స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ బీసీ సంక్షేమ శాఖ అధికారిణి సునీత కుమారి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, చరణ్ గౌడ్, బీసీ, గౌడ సంఘ నాయకులు దత్తుతో పాటు పలు సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఇతరుల వాహన నంబర్ ప్లేట్ వినియోగించిన వ్యక్తి అరెస్ట్

## చలాన్లు తప్పించుకునేందుకు ఘరానా మోసం

## నిందితుడి నుంచి ద్విచక్ర వాహనం సీజ్..

## రిమాండ్‌కు తరలింపు

వాస్తవ నేస్తం,సిరికొండ : ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు ఇతరుల ద్విచక్ర వాహనం నంబర్ ప్లేట్‌ను దుర్వినియోగం చేస్తున్న ఓ యువకుడిని సిరికొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్సై బి. విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం గోనా గ్రామానికి చెందిన సయ్యద్ మొహీన్‌కు సీబీ షైన్ (జదీ రాష్ట్రఅలవ) ద్విచక్ర వాహనం ఉంది. కాగా, జూలై 3వ తేదీన సిరికొండ మండల పరిధిలో హెల్మెట్ లేకుండా ప్రయాణించినట్లు మొహీన్ వాహన నంబర్‌పై ట్రాఫిక్ ఈ-చలాన్ జారీ అయింది. అయితే ఆ సమయంలో తాను సిరికొండ ప్రాంతానికి అసలు వెళ్లలేదని, తన వాహనం నంబర్‌పై తప్పుడు చలాన్ వచ్చిందని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాల ద్వారా అసలు నిందితుడిని గుర్తించారు. దశ్నాపూర్‌గూడ గ్రామానికి చెందిన పచ్పుటే కృష్ణ (26) అనే వ్యక్తి తన బైక్‌పై ట్రాఫిక్ చలాన్లు పడకుండా ఉండేందుకు సయ్యద్ మొహీన్ వాహన నంబర్ ప్లేట్‌ను అక్రమంగా వాడుతున్నట్లు తేలింది. దీంతో పోలీసులు నిందితుడు పచ్పుటే కృష్ణను అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా చలాన్లు తప్పించుకునేందుకు ఇతరుల వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు, ఫేక్ నంబర్ ప్లేట్లు వాడితే చట్టపరంగా కఠిన చర్యలు




తీసుకుంటామని హెచ్చరించారు.

# గ్రూప్1 పరీక్షలో చరిత్రలో చూడని అక్రమాలు

వాస్తవ నేస్తం,అమరావతి, ఆగస్టు 19: గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్--1 పరీక్షల్లో ఊహకు కూడా అందని స్థాయిలో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. గత పాలకులు బరితెగించి అక్రమాలకు పాల్పడ్డారని.. రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించాల్సిన గ్రూప్ 1 సర్వీసు అభ్యర్థుల నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని శాసనసభకు తెలియచేశారు. 344 నిబంధన కింద శాసనసభలో చేపట్టిన ప్రత్యేక చర్చలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏర్పడిన ఏపీపీఎస్సీ రాష్ట్రానికి కీలకమైన అధికారులను ఎంపిక చేసే సంస్థ అని..దాని విశ్వసనీయతను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో సీఎం సీట్లో కూర్చుని నేరాలు చేసిన వ్యక్తి నేడు వాటిపై ప్రజలకు సమాధానం చెప్పేందుకు శాసనసభకు రాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్షేపించారు. ఎదురు దాడి చేసేందుకు 24 గంటలూ కుట్రలు చేయటం కాదని బాధ్యతాయుతంగా జవాబు చెప్పాలని సవాలు చేశారు.

**కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదు**

2018లో జారీ చేసిన గ్రూప్--1 నోటిఫికేషన్‌కు 1.14 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని. ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధించుకునే ఈ పరీక్షల నిర్వహణలో నిబంధనలను పూర్తిగా విస్మరించారని సీఎం అన్నారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను సైతం అత్యంత భద్రత మధ్య పోలీసు ఎస్కార్టుతో తరలిస్తామని, అలాంటిది రాష్ట్రాన్ని పాలించే అధికారులను ఎంపిక చేసే గ్రూప్--1 పరీక్షల జవాబు పత్రాల విషయంలో భద్రతను గాలికి వదిలేసి ఇష్టానుసారం వ్యవహరించారన్నారు. డిజిటల్ మూల్యాంకనాన్ని పక్కనపెట్టి మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కోర్టును తప్పు దోవ పట్టించేలా అఫిడవిట్లు దాఖలు చేశారని చంద్రబాబు అన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత సరిదిద్దుకోవాల్సింది పోయి హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం కోసం రూ.1.19 కోట్ల విలువైన పనులకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఒకవైపు కోర్టు ఆదేశాలు ఉండగానే ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టారని తెలిపారు. హైకోర్టు ఈ వ్యవహారంపై విచారణ జరిపి విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు.

ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు

# అక్రమంగా నిల్వ చేసిన 150 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

వాస్తవ నేస్తం,ఇంద్రవెల్లి : ప్రభుత్వం పేదలకు అందించే పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న ఓ కిరాణా వ్యాపారిని ఇంద్రవెల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి మూడు సంచుల్లో ఉన్న 150 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్ పర్యవేక్షణలో ఇంద్రవెల్లి ఎస్సై ఈ. సాయన్న సిబ్బందితో కలిసి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలోని ఓ కిరాణా దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అక్రమంగా దాచిన 150 కిలోల పీడీఎస్ బియ్యం బయటపడింది. దీంతో దుకాణ యజమాని